క్లుప్తంగా

లోకోస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు, ఆర్థిక వ్యవహారాలన్నీ లోకోస్ యాప్‌లోనే నిర్వహించాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. లోకోస్ యాప్‌ను ఎలా నిర్వహించాలనే దానిపై అకౌంటెంట్లు అవగాహన పెంచుకోవాలని సూచించారు. శుక్రవారం డీఆర్‌డీఏ-వైకేపీ సమావేశ మందిరంలో అకౌంటెంట్లకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ గతంలో సంఘాల ఆర్థిక కార్యక్రమాలను మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా నిర్వహించడం జరిగేదని, తాజాగా లోకోస్ యాప్ ద్వారా నిర్వహించేలా కేంద్రం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. పొదుపు సంఘాలు బ్యాంకుల నుంచి తీసుకునే లింకేజీ రుణాలు, సున్నా వడ్డీ వివరాలు తదితరవన్నీ ఈ-యాప్‌లోనే అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు పీడీ శ్రీధర్ రావు, డీపీఎం రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్) : మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, హింసాత్మక ఘటనలను నిరసిస్తూ శనివారం కర్నూలు నగరంలో భారీ ఎత్తున్న శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి అధ్యక్షుడు ప్రభుదాసు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక కోల్స్ చర్చిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కర్నూలు(రాజ్‌విహార్): పేదల కోసం ఈ నెల 9వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అహ్లెహదీస్ మర్కజ్ మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు ఉమర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వడ్డెగేరిలోని మర్కజ్ మసీద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలకు ఫోన్ 9849349275, 9848496055, 9440604011 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సభ్యులు అబ్దుల్ రజాక్, అన్వర్ పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల రెండో శనివారం చేపట్టే నిర్వహణ పనుల్లో భాగంగా ఈ కోతలు విధిస్తున్నామని, ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నంది నాటక పోటీల పునః నిర్వహణ హర్షణీయం

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా నిలిచిపోయిన నంది నాటక పోటీలను తిరిగి ఈ సంవత్సరం నుంచి నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా సంయుక్త ప్రకటనలో తెలిపారు.

దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులకు కారణమయ్యే దోమలు ఇళ్ల పరిసరాల్లో పెరగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇందిరమ్మ హౌసెస్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. స్థానిక కాలనీలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడేను పర్యవేక్షించారు.

ఈ-కేవైసీకి అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పీఎం కిసాన్ కింద రైతులు ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెలాఖరు వరకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడువులోపు చేసుకుంటే 14వ విడత పీఎం కిసాన్ సాయం పొందేందుకు అర్హులవుతారన్నారు.

విస్తృత తనిఖీలు

కర్నూలు (న్యూసిటీ) : తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం ఆదోనిలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కాటాలకు ముద్ర, వస్తువుల ప్యాకేజీలపై గడువు ప్రింట్ లేనందున నాలుగు కేసులు నమోదు చేసి రూ. 31 వేలు జరిమానా విధించినట్లు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ వెల్లడించారు.

పేదల గుండెల్లో వైఎస్సార్

- మహానేత హయాంలో నగరంలో వేలాది మందికి గూడు
- నగర నడిబొడ్డున రాజీవ్‌గృహకల్ప సముదాయం
- శివారులో ఇందిరమ్మ గృహాల నిర్మాణం
- నేడు దివంగత వైఎస్సార్ జయంతి



బుధవారపేటలోని రాజీవ్‌గృహకల్ప సముదాయం

కర్నూలు (టౌన్) : పేదల గుండెల్లో దివంగత వైఎస్సార్ గుడి కట్టుకున్నారు. పలు సంక్షేమ పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూర్చి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ముఖ్యంగా పేదల సొంతింటి కలను సాకారం చేశారు. రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ గృహాల పేరుతో కర్నూలు నగరంలో వేలాది మందికి గూడు కల్పించారు. నేడు దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

వైఎస్సార్ పేదలకు మేలు చేసేందుకు పరితపించేవారు. 2004లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ,, పేదలకు పక్కా ఇళ్లు ఇలా పలు పథకాలు అమలు చేశారు. 2005 సంవత్సరంలో రాజీవ్ గృహకల్ప పథకం కింద కర్నూలు నగర నడిబొడ్డున బుధవారపేట, పెద్దపాడు సమీపంలో అపార్ట్‌మెంట్లు నిర్మించారు. పట్టణంలోని పేదలకు వాటిలో ఇళ్లను కేటాయించారు. రెండు చోట్ల కలిపి 1444 కుటుంబాలకు గూడు కల్పించారు. ఇందుకు అప్పట్లో ప్రభుత్వం రూ.1.20 కోట్లు ఖర్చు చేసింది. అలాగే ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్సార్ పెద్దపీట వేశారు. పెద్ద పాడు వద్ద రోడ్డు ఫార్మేషన్, నీటి వసతి కోసం పైపులైన్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు శరవేగంగా ఏర్పాటు చేశారు.

నగర శివారులో వేలాది గృహాలు

కర్నూలు నగరానికి 2007 సంవత్సరంలో వరదలు వచ్చాయి. దీంతో అప్పట్లో తుంగభద్ర, హంద్రీ, కేసీ కెనాల్ పరివాహక ప్రాంతంలో నివసించే పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారందరికీ సురక్షిత ప్రదేశంలో సొంత ఇళ్లను నిర్మించాలని దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్ణయించారు. అందులో భాగంగా నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద 13, 500 గృహాలను నిర్మించారు. నాడు రాజీవ్‌గృహకల్ప అపార్టుమెంట్లతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఒక్క జగన్నాథ గట్టు వద్దే 13, 500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, పందిపాడు గ్రామంలో వాంబే కాలనీ పేరుతో 560, ఐహెచ్‌ఎస్‌డీపీ కాలనీ పేరుతో జొహరాపురం గ్రామంలో మరో 2 వేల ఇళ్లను కట్టించారు. అలాగే ఖాళీ స్థలం ఉండి గూడు కట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారికి గృహ నిర్మాణానికి సాయం అందజేశారు. దీంతో నేడు వైఎస్సార్ లేకపోయినా ఆయన చేసిన మేలును పేదలు గుర్తు చేసుకుంటున్నారు.



నగరంలోని వైఎస్సార్ సర్కిల్‌ను నగర పాలక అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. నూతనంగా వాటర్ ఫౌంటెన్‌ను ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాల కాంతుల్లో జలపరవళ్లు ఆకట్టుకుంటున్నాయి. వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం ఈ ఫౌంటెన్‌ను ప్రారంభించనున్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

సురక్షతో సులభంగా ధ్రువీకరణ పత్రాలు



మహిళకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని
- 19వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం

కల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సులభంగా అందుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు పరిధిలోని నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే కాటసాని, కమిషనర్ భార్గవతేజ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన సాగిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. అర్హతే కలిగిన వారందరికీ తాము సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశం కూడా అదేనన్నారు. కమిషనర్ భార్గవతేజ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సచివాలయాల దగ్గరే వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రామలింగేశ్వర్, జిల్లా డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు అర్బన్ వార్డుల జేసీఎస్ కన్వీనర్లు గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాంస్వామి, నాగరాజు, సుహాసిని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల్లో హైమాస్ లైట్లను ఏర్పాటు చేయండి

జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ జి. సృజన




కంప్యూటర్లు అందజేస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్) : జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో త్వరగా హైమాస్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రోడ్డుభద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జాతీయ రహదారుల్లో హైమాస్ లైట్ల ఏర్పాటు ప్రతిపాదనలను రీజినల్ కార్యాలయానికి పంపామని చెప్పగా త్వరగా మాట్లాడి ఆమోదం తెప్పించుకోవాలని ఆదేశించారు. ఓర్వకల్‌లో అండర్ పాస్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఎంత వరకు వచ్చాయని జాతీయ రహదారి 40 ప్రాజెక్టు డైరెక్టర్‌ను ప్రశ్నించారు. నగరంలో నిరుపయోగంగా ఉన్న 47 బస్ షెల్టర్లను తొలగించి వాటిని అవసరమైన ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ కలెక్టర్‌కు వివరించారు. కాగా, నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి టెండర్ దశ పూర్తయిందని, వైర్లతో కూడిన సీసీ కెమెరాలకు బదులుగా సోలార్‌తో పనిచేసే వాటిని ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సంబంధించిన ఏజెన్సీలను పోలీసు అధికారులకు అటాచ్ చేసినట్లు చెప్పారు. నన్నూరులోని జగనన్నకాలనీ అప్రోచ్ కాలనీ రోడ్డుకు సంబంధించి ప్రాంతాన్ని సందర్శించి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఎన్‌హెచ్‌పీడీని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో రవాణా శాఖ డీటీసీ శ్రీధర్, ఆర్టీసీ అధికారులు, నేషనల్ హై వే కర్నూలు, అనంతపురం అధికారులు పాల్గొన్నారు.

- జిల్లాలోని 8 మండల సహాయ గణాంకాధికారి కార్యాలయాలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి. కర్నూలు ఉప గణాంకాధికారితోపాటు కర్నూలు సహాయ గణంకాధికారి, గూడూరు, పెద్దకడబూరు, నందవరం, కోసిగి, దేవనకొండ, ఎమ్మిగనూరు కార్యాలయాలకు కంప్యూటర్లు మంజూరయ్యాయి. శుక్రవారం సీపీఓ జేడీ ఎల్.అప్పలకొండ ఆధ్వర్యంలో వాటిని కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత అధికారులకు అందజేశారు.

శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి



70 వసంతాలు పూర్తి చేసుకున్న రిటైర్డు వార్డెన్లను సన్మానించిన దృశ్యం

కర్నూలు(అర్బన్): పదవీ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి తన శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని రిటైర్డు బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో బీసీ రిటైర్డు వార్డెన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 70 వసంతాలు నిండిన బీసీ సంక్షేమాధికారులు కె. రాముడు, వెంకట్‌రావు, జి. తిరుపాలు, ఎస్. వెంకటసుబ్బయ్యను అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సర్వసాధారణమన్నారు. మారుమూల గ్రామాల నుంచి విద్య కోసం వచ్చే ఎంతో మంది నిరుపేద బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు వసతి కల్పించి వారికి నాణ్యమైన ఆహారం అందించిన చరిత్ర వసతి గృహ సంక్షేమాధికారులదన్నారు. తమ విద్యార్థులు నేడు అనేక రంగాల్లో ఎంతో ఉన్నతమైన స్థానాల్లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో రిటైర్డు వసతి గృహ సంక్షేమాధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు కేటీ బాబు, పి. శ్రీనివాసులు, జి. కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, బి. వెంకటేశ్వర్లు, జి. శ్రీధర్‌బాబు, మహబూబ్ బాషా, విక్టోరియారాణి, ఎం. శ్రీనివాసులు, మహాలక్ష్మి, అనంతశయన, భీమలింగప్ప, ఎం. కృష్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన భక్తులు

- శాకాంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ఓల్డ్‌సిటీలో బోనాలతో భక్తుల ఊరేగింపు



నిమిషాంబా ఆలయంలో శాకాంబరిగా అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఆషాఢమాసం శుక్రవారాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు శాకాంబరిగా దర్శనం ఇచ్చారు. ఓల్డ్‌సిటీ బండిమెట్టలోని గంగా భవానీ సహిత శ్రీకేధారేశ్వర స్వామి దేవాలయం, మించిన్ బజార్ పెద్ద, చిన్న ఎల్లమ్మ ఆలయాలు, చిత్తారి వీధి నిమిషాంబా దేవి ఆలయం, సప్తగిరి నగర్ చౌడేశ్వరీ దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాలు ఆకు కూరలు, కూరగాయలతో శాంకాంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు భక్తులు108 బోనాలతో పుర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. పెద్ద ఎల్లమ్మ ఆలయంలో లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, రాధాకృష్ణ, ఇంద్రావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం రామచంద్రానగర్‌లోని శ్రీసాయి క్రిష్ణ డిగ్రీ కాలేజీలో చేపట్టిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాలను వినియోగించుకోవాలన్నారు. ఇందులో గ్రీన్ టెక్, ఆల్ సెక్ టెక్నాలజీస్, అమర్‌రాజా బ్యాటరీస్, ఎస్ఎల్‌వీ ఎంటర్‌ప్రైజెస్, ముత్తూట్ ఫైనాన్స్, ఎన్ లైట్ కాండ్ ఇంజినీరింగ్, భారత్ ఎఫ్ఐఎన్, ఓమ్ని హాస్పిటల్స్, అరబిందో ఫార్మా, నవభారత్ ఫర్టిలైజర్స్, కృష్ణకాంత్ ఇన్ఫ్రా, శ్రీధర కన్‌స్ట్రక్షన్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. 945మంది హాజరుకాగా 252 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో సెట్కూరు సీఈఓ రమణ, ఉపాధి కల్పన అధికారి దీప్తి, శ్రీసాయిక్రిష్ణ డిగ్రీ కాలేజీ వ్యవస్థాపకులు గోవర్ధన్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ వి.శ్రీకాంత్ రెడ్డి, సీడాప్ మేనేజర్ కిరణ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయితేజ, కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

ట్రెజరీలో కారుణ్య నియామకాలు

కర్నూలు(అగ్రికల్చర్): కారుణ్య నియామకాలు పొంది జిల్లా ట్రెజరీ కార్యాలయానికి అలాట్ అయిన ముగ్గురు జూనియర్ అకౌంటెంట్లకు జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు శుక్రవారం పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అరుణ్‌రాజ్, సాయిప్రియలను జూనియర్ అకౌంటెంట్లుగా నియమించారు. లీలావర్ధన్‌ను కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కర్నూలు(రూరల్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారంసీఆర్ భవనంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

9న ఎన్‌టీఆర్ పాటలకు నృత్య ప్రదర్శన

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 9వ తేదీ ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకు ఏకధాటిగా ఎన్టీఆర్ నటించిన సినిమాల్లోని పాటలకు నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కన్వీనర్, నృత్య గురువు కరీముల్లా పేర్కొన్నారు. శుక్రవారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్) :నగరంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు సుధాకరప్ప కోరారు. శుక్రవారం నగరంలోని 32వ వార్డు ముజఫర్ నగర్‌లో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించింది. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సులతో జ్ఞాన సముపార్జన

కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో నిర్వహించే నిరంతర వైద్య విజ్ఞాన సదస్సుల ద్వారా జ్ఞానసముపార్జన కలుగుతుందని సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యూ. సీతారామ్, స్విమ్స్ (తిరుపతి) న్యూరాలజి హెచ్‌ఓడీ డాక్టర్ వెంగమ్మ చెప్పారు. ఏపీ న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో కర్నూలులో 30వ వార్షిక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు న్యూరోక్లబ్ ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ సీఎల్‌జీలో సీఎంఈ నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డాక్టర్ డబ్ల్యూ. సీతారామ్, డాక్టర్ వెంగమ్మ మాట్లాడారు. ఏపీ న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌వీ. రాజు, కార్యదర్శి డాక్టర్ బాబ్జి శ్యామ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె. నరసరామ్, న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

కర్నూలు(రాజ్‌విహార్): వర్షాలు, గాలి వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయ సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు.

సెక్టోరియల్ పోస్టుల దరఖాస్తుకు గడువు పెంపు

కర్నూలు (సిటీ): సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్ల పోస్టులకు డిప్యుటేషన్ పద్ధతిన పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి ఆహ్వానించిన దరఖాస్తుల గడువును పెంచినట్లు సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో గడువు ముగిసింది, దరఖాస్తుల గడువును ఈనెల 10 వరకు పొడిగించామని, ఆసక్తి ఉన్నవారు ఎవరైనా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

సంతకాల సేకరణ

కర్నూలు(రూరల్) : నగరంలోని వివిధ ప్రాంతాల్లో యూనిఫాం కామన్ సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాలు సేకరించినట్లు నగర అధ్యక్షుడు ఎక్బాల్ హుసేన్ తెలిపారు.

రైతు బజార్ ఎదుట ధర్నా

కర్నూలు(రూరల్) : పెరిగిన కూరగాయల ధరలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం ఆ పార్టీ సి.క్యాంప్ రైతుబజార్ ఎదుట ధర్నా నిర్వహించింది.

ఫుట్‌బాల్‌ను ఆదరించాలి

కర్నూలు(రూరల్): ఫుట్‌బాల్ క్రీడను ఆదరించాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ తెలిపారు. శుక్రవారం ఔట్ డోర్ స్టేడియంలో నవాబ్ ఆలఫ్ ఖాన్ స్మారకార్థం అంతర్ పాఠశాలల ఫుట్‌బాల్ పోటీలను జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సీఈఓ రమణ, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అతిథులుగా హాజరై మాట్లాడారు.